క్లుప్తంగా

ఘనంగా ఖాదర్‌వలీ ఉరుసు


ప్రత్యేక అలంకరణలో ఖాదర్‌వలీ జెండామాను

రాజంపేట టౌన్: మండలంలోని గాంధీనగర్‌లో శుక్రవారం రాత్రి ఖాదర్‌వలీ ఉరుసును ఘనంగా నిర్వహించారు. ఉరుసును పురస్కరించుకొని జెండామానును శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా పగడాల బ్రహ్మయ్య ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉరుసులో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని చదివింపులు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. జెండా ఊరేగింపు కార్యక్రమంతో ఉరుసు వేడుక ముగిసింది.

2న సమావేశం

రామాపురం: మండల ఎంపీడీఓ కార్యాలయంలో జనవరి 2వ తేదిన ఉదయం 9గంటలకు నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లు జారీ చేస్తామని ఎంపీడీఓ హైదర్‌వల్లి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామికి పూజలు

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అర్చకులు మణికంఠ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేసి స్వాములవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో డీఆర్‌డీఏ పీడీ

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను శనివారం వైఎస్సార్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్ కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంచనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేడు వైద్య శిబిరం

రామాపురం: మండల పరిధి గువ్వలచెరువు ఎంపీయూపీ తెలుగు పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాదాసు కుమార్ తెలిపారు. కడపకు చెందిన సిద్ధార్థ న్యూరో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వెన్నుపూస, మెదడు, నరాల వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. పక్షవాతం, తలనొప్పి, వెన్నుపూస నొప్పి, వణుకు పార్కిన్, నరాల బలహీనత, నిద్ర, మానసిక సమస్యలు, మలేరియా, టైఫాయిడ్, మూత్ర సమస్యలు, కిడ్నీ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, మండల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధనుర్మాస పూజలు



పెనగలూరు (ఓబులవారిపల్లె): మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మ, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య స్వాముల ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామికి ధనుర్మాస పూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ పి సుబ్బారెడి ఈ పూజలో పాల్గొన్నారు. అనంతరం వేణుగోపాలస్వామిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉత్తమ డ్రైవర్లుగా స్థిరపడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా కడప డిపోలో హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందిన డ్రైవర్లు వృత్తిలో స్థిరపడాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం 18వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సరిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు కడప డిపోలో 18 బ్యాచ్‌ల ద్వారా 300 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం 19వ బ్యాచ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు గంట పాటు వాహనంలోని వివిధ విభాగాల పనితీరు, రోడ్లపై ఉండే మార్కింగ్‌లు, రోడ్డు పక్కనగల సైన్ బోర్డులు, సిగ్నల్స్ గురించి వివరంగా నిపుణులచే అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం డిల్లీశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

నోరూరిస్తున్నాయ్

కొత్త సంవత్సర కేకులు కేక పుట్టిస్తున్నాయి. ఒకప్పుడు న్యూఇయర్ అంటే కొత్త దుస్తులు, గ్రీటింగ్ కార్డులకే ప్రాధాన్యత ఉండేది. అయితే సాంకేతికత అందుబాటులోకి వచ్చాక గ్రీటింగ్స్ కనుమరుగైపోయాయి. అలాగే ప్రజల అభిరుచి కూడా మారింది. ఇప్పుడు న్యూఇయర్ అనగానే పేదలు, ధనవంతులన్న తేడా లేకుండా చాలా మంది కేక్‌లను కొనుగోలు చేస్తున్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12 గంటల సమయం కాగానే కేక్ కట్ చేసి కొత్తసంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు ప్రజల అభి'రుచి'ని 'క్యాష్' చేసుకుంటున్నారు. విభిన్న ఆకృతుల్లో కేకులను తయారు చేస్తున్నారు. దీనికోసం బేకరీ షాపు యజమానులు వివిధ ప్రాంతాల నుంచి నైపుణ్యంగల కళాకారులను సైతం రప్పించడం విశేషం. న్యూఇయర్ సందర్భంగా జిల్లాలో అరకోటి రూపాయిలకు పైగా కేక్‌ల వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

రుచికరంగానూ....

కేక్‌లు ఇప్పుడు రుచిలోను మేటిగా ఉన్నాయి. వెనీలా, పైనాపిల్, చాక్లెట్, బటర్‌స్కాచ్ వంటి కేక్‌లు నోరూరిస్తున్నాయి. అలాగే కూల్ కేక్‌లు కూడా అందుబాటులోకి వచ్చి ఆహా అనిపిస్తున్నాయి. ఇదిలావుంటే అరకిలో కేక్ రూ.150, కిలో కేక్ రూ.250, వివిధ రకాల ఫ్లేవర్ల కేక్‌లు మూడు వందలు, మూడువందల యాభై రూపాయిలకు, కూల్ కేక్‌లు 450 రూపాయిల నుంచి ఎనిమిది వందల రూపాయిల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వెరైటీ ఆకృతుల్లోని కేకుల కోసం ఇప్పటికే అడ్వాన్సులు భారీగా వచ్చాయని వ్యాపారులు చెబుతుండడం విశేషం.

– రాజంపేట టౌన్





వివిధ ఆకృతుల్లో కేకులు

మంచి డిమాండ్ ఉంటుంది



కొన్ని సంవత్సరాలుగా న్యూ ఇయర్ రోజు దాదాపు అందరూ కేక్ కట్ చేసి కొత్త సంవత్సరం వేడుక జరుపుకుంటున్నారు. అందువల్ల బేకరీ వ్యాపారులందరం కూడా ప్రజలకు సరిపడా కేక్‌లు తయారు చేసి సిద్ధంగా ఉంచుతున్నాం. కొంతమంది ఇప్పటికే అడ్వాన్స్‌లు ఇచ్చి కేక్‌లను బుక్ చేసుకున్నారు. వెరైటీ కేక్‌లకు డిమాండ్ ఉంటుంది. – **అబ్దుల్ రజాక్, కేక్‌ల వ్యాపారి, రాజంపేట**

వేడుకలను సంతోషంగా జరుపుకోండి

ఓబులవారిపల్లె: నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31వ తేది రాత్రి నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా గ్రామాలలో మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, నూతన సంవత్సర వేడుకల్ని ఎలాంటి గొడవలు లేకుండా సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నందలూరు(రాజంపేట): కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేది రాత్రి టౌన్ నందు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని.. అతివేగం, అధిక శబ్దాలతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అటువంటి వారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా హిందూ సమ్మేళనం


మాట్లాడుతున్న విరిజానంద స్వాములు

సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ సమీపంలో శనివారం మండల హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని శ్రీ ఈశ్వరి మఠం పీఠాధిపతులు వీర శివకుమార్, అచలానంద ఆశ్రమం విరిజానంద స్వాములు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన సిద్ధవటంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం నుంచి గ్రామ శివారులోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు సమరసత సేవా ఫౌండేషన్, మండల హిందూ సమ్మేళనం వారి ఆధ్వర్యంలో తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా శోభాయాత్ర ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జైశ్రీరాం అంటు నినాదాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ హిందూ ధర్మం, సంస్కృతి, జీవన విలువల ప్రచారం, దేవాలయ కేంద్రంగా భజన మండలి, భజన సామూహిక హారతి, ధార్మిక ప్రసంగాలు, బాల వికాస కేంద్రాలు , ఇంటింటికి ధర ప్రచారం, విద్యార్థుల్లో, యువకుల్లో జీవన విలువలు పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలను పీఠాదిపతులు తెలియజేశారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం రోజున ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయ పద్ధతిలో మీ గ్రామాల్లో గుడికి వెళ్లి ఐదు రకాల దీపారాధనలు చేయాలని వారన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు స్థానికులు అన్నప్రసాదాలను చేపట్టారు. సమరత సేవా పౌండేషన్ కన్వీనర్ వెంకటేష్, స్థానిక నాయకులు రాజానాయుడు, ఎ. దినేష్ , సంఘ ద్దలు బలరామక్రిష్ణ, సిద్ధవటం మండల కన్వీనర్ నరసింహులు, ధర్మ ప్రచార కమిటీ సభ్యులు వెంకటరమణ, బజాజ్ షోరూం అధినేత అయ్యప్ప, మాజీ సర్పంచ్ ఓబులయ్య, నాగరాజు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె ఖాజీగా జఫరుల్లాఖాన్



సుండుపల్లె (రాజంపేట): సుండుపల్లె ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీగా జఫరుల్లాఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధితశాఖ నుంచి ఉత్తర్వులను ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఖాజీగా నియమించినందుకు సహకరించిన రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీమిథున్‌రెడ్డి, శాసనసభ్యుడు మేడామల్లికార్జునరెడ్డిలకు కృతజ్ఞతలను తెలియచేశారు. మండల ముస్లింమైనార్టీ నాయకులకు, మసీదు కమిటీలకు తన వంతు బాధ్యత సేవలందించేందుకు ముందుంటానన్నారు.

3 నుంచి సమ్మె ఉధృతం


మస్టర్ సమయంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ కార్మికులు

రాయచోటి అర్బన్: జనవరి 3వ తేది నుంచి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేయనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం మస్టర్ సమయంలో పారిశుధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బి.వి.రమణ, కేశవరావు, వెంకటలక్ష్మి, సరోజ, హరి, సుజాత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కార్మికులతో పనులు చేయించడం ఆపాలి

ప్రైవేటు కార్మికులతో పట్టణంలో పారిశుధ్య పనులు చేయించడం వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. రామాంజులు డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. సమ్మెకు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం


గ్యాస్ సిలిండర్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న అధికారులు

నందలూరు(రాజంపేట): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్రం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టిందని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాటూరు, నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి దేశ వ్యాప్తంగా మారుమూల పల్లెల్లో సైతం గత పదేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలుకోసం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులు గురించి ఆయా వర్గాల ప్రజలలో అవగాహన కల్పించారు. పథకాలు అందని అర్హులకు పథకాలు అందేలా చేస్తూ, కేంద్ర ప్రభుత్వం ఏయే పథకాలు అందిస్తోందో తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఈఓఆర్‌డీ సతీష్ కుమార్, ఏపీఎం వసుంధర, ప్రత్యేక అధికారి హరి నారాయణ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మీకాంతమ్మ, కో–ఆర్డినేటర్ కోడూరు ఆదినారాయణ, బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య, విఠల్ స్వామి, చుక్కా శ్రీనివాసులు, మురళీ, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత సంకల్పయాత్ర

వీరబల్లె (రాయచోటి టౌన్): వీరబల్లెలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న వికసిత్ భారత సంకల్ప యాత్ర ముగిసింది. శనివారం చివరిగా మండల పరిధిలోని మట్లి, తాటిగుంటపల్లె గ్రామాలలో నిర్వహించి ముగించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని సచివాలయాలలో కార్యక్రమాలను నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను వివరించి చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హతే ఆధారంగా అందుతున్నాయని తాటిగుంటపల్లె సర్పంచ్ గోపినాథ్‌రెడ్డి, మట్లి గ్రామ సర్పంచ్ సోమారపు సర్పంచ్ నాగార్జునాచారి ప్రజలకు సూచించారు. ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, ప్రభాకర్ ఇండియన్స్ గ్యాస్ ఏజెన్సీ యజమాని సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్ మధుకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధవటం కోర్టును తనిఖీ చేసిన అదనపు జిల్లా జడ్జి


జడ్జి ఇంతియాజ్ అహ్మద్‌కు స్వాగతం పలుకున్న సిద్ధవటం జడ్జి శ్రీనివాసకళ్యాణ్

సిద్ధవటం: సిద్ధవటం లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టును శనివారం అదనపు జిల్లా జడ్జి ఇంతియాజ్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కోర్టు లోని పలు రకాల రికార్డులను అప్‌డేట్‌గా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకుముందు కో జిల్లా జడ్జిని, సిద్ధవటం కోర్టు జడ్జి శ్రీనివాసకళ్యాణ్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసకళ్యాణ్, సిద్ధవటం, అట్లూరు, ఒంటిమిట్ట ఎస్ఐలు , పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా


ఎంపీడీఓ విజయారావు

ఓబులవారిపల్లె: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులకు మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్ర పోటీలలో భాగంగా ఇప్పటి వరకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో క్రీడలను నిర్వహించామని తెలిపారు. మండల స్థాయిలో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ ప్రకారం దశలవారిగా పోటీలను నిర్వహిస్తున్నామని జనవరి 6న మండలస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని, అనంతరం నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. సిబ్బంది రవికుమార్ పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ


పీహెచ్‌సీ వైద్యులకు సలహాలు,సూచనలు ఇస్తున్న రాష్ట్ర జేడీ విద్యాసాగర్

రాయచోటి అర్బన్ : హైరిస్క్ గర్భిణులకు వైద్యమందించడంలో వైద్యులు తగుజాగ్రత్తలు తప్పకుండా పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రజాయింట్ డైరెక్టర్ విద్యాసాగర్ సూచించారు. శనివారం పట్టణంలోని కె.రామాపురం అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్‌లో పిహెచ్‌సి వైద్యులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమోదు చేసుకున్న గర్భిణులోసాధారణ చెక్‌అప్‌ల ద్వారా అనుమానం ఉన్న హైరిస్క్ గర్భిణులను గుర్తించాలన్నారు. గుర్తించిన వారిని ఉన్నత ఆసుపత్రికి రెఫర్‌చేసి సాధారణకాన్పు జరిగేలా తగుచర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో జనవరి 2వతేదిన నిర్వ హించబోవు జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్యులకు పలుసూచనలు చేశారు. డీపీఎంఓ డాక్టర్ రియాజ్‌బేగ్, డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ రమణమహర్షి జయంతి


భగవాన్ రమణమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను నిర్వహిస్తున్న భక్తబృందం

రాజంపేట: భగవాన్ రమణమహర్షి జయంత్యుత్సోవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ సమీపంలో రమణ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. రమణమహర్షి పేరిట భక్తి గీతాలను ఆలపించారు. రమణమహర్షి జయంతి సందర్భంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వహక భక్తబృందం యేటా రమణమహర్షి జయంతి వేడుకలను నిర్వహించడం ఆరవసారి కావడం గమనార్హం.

డీసీసీ అధ్యక్షుడిని తొలగించాలి

రాయచోటి టౌన్ : అన్నమయ్యజిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీగా ఎన్నికైన అల్లాబకాష్‌ను వెంటనే తొలగించాలని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అల్లాబకాష డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ ప్రాంతాలలోకి రావడం ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికి సమాచారం ఇవ్వకుండా ఆయన ఇష్టానుసారంగా ఇతరా పార్టీలలో పని చేస్తున్న వారికి పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. దశాబ్దకాలంగా పని చేస్తున్న వారికి కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఆయనకు ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరించి పార్టీ వినాశనానికి పని చేస్తున్నారని విమర్శించారు. ఆయనను తొలగించే వరకు తాము పోరాటం సాగిస్తామని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, మదనపల్లె కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నీలా శ్రీనివాస్, తంబళ్లపల్లె కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ శ్రీవర్ధిని, జిల్లా సెక్రటరీ మూగూ నాయక్, మహిళ నాయకులు సైదానీ, లీలా శ్రీనివాస్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి ప్రతిసృష్టికర్తలు చిత్రకారులు


మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : సృష్టికి ప్రతిసృష్టికర్తలు చిత్రకారులు అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో ›జీవన సంప్రదాయాలు‹ మ్యూరల్ పెయింటింగ్‌పై ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ చిత్రకారులు కావాలన్న ఒక ఉన్నత ఆశయంతో కోర్సులో ప్రవేశాలు పొంది ఉంటారని, ఆ ఆశయాన్ని నెరవేర్చుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లో నిపుణుల ద్వారా పొందిన నైపుణ్యాలను ప్రొఫెషనల్ ఆర్టిస్టులుగా తయారయ్యేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో విద్యార్థులు గోడలపై గీచిన 16, 32 అడుగుల చిత్రాలు విశ్వవిద్యాలయానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ వర్క్‌షాప్ విజయవంతమైందన్నారు. రీసోర్స్ పర్సన్‌లు పి.సంతోష్‌కుమార్, కె.రవిలు మాట్లాడుతూ వర్క్‌షాప్, నైపుణ్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ సమన్వయకర్తలు సి.వెంకటేష్, బి.చినరాయుడు, బి.ఈరప్ప, ఎం.వాసవి, కె. రెడ్డిశేఖరరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా దర్గా గురువుల జయంతి

కడప కల్చరల్ : విశ్వవిఖ్యాత ధార్మిక సంస్థ కడప పెద్దదర్గా 10వ పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా అమీన్‌పీర్ సాహెబ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం కడప నగరంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంర్భంగా దర్గా ప్రతినిధులు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో గురువుల పేరిట భారీ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. దాదాపు 800 మంది విద్యార్థులకు నిర్వాహకులు పండ్లు, కేక్‌లు, స్వీట్లు, చాక్లెట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కడప నగరంలోని అన్ని అనాథ బాలల శరణాలయాలు, పేదలు, అనాథలు, వృద్ధుల శరణాలయాల్లో పండ్లు, కేకులు, బిస్కెట్లు, బ్రెడ్లు పంచి పెట్టారు. దర్గా ప్రతినిధులు రిమ్స్ ఆస్పత్రితోపాటు నగరంలోని మరికొన్ని ఆస్పత్రుల్లో పేదలకు ఆహార పదార్థాలు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు. దర్గా ప్రతినిధులు బృందాలుగా వెళ్లి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నేడు బుడ్డా వెంగళరెడ్డి వర్ధంతి

కడప సెవెన్‌రోడ్స్ : రేనాటి చంద్రునిగా, అపర కర్ణునిగా పేరుగాంచిన ఉయ్యాలవాడకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి 123వ వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మహనీయుని వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న సభలో సీపీఐ, సీపీఎం, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ, ఏపీ రెడ్డి సంఘం పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు



శ్రీ రిషీ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుంటున్న దృశ్యం

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాల నందు శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ టి యువరాజ నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వేంపల్లె: నూతన సంవత్సర వేడుకలలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

ముందస్తు నూతన సంవత్సర సంబరాలు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలతో ఆటల పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఏడాదిలో ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలన్నారు. ఎండీలు చేతన్‌రెడ్డి, చైతన్యారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

లక్కిరెడ్డిపల్లి: వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామిని పట్టు వస్త్రాలతోపాటు అలంకరించారు. అలాగే రామాపురం రోడ్డు మార్గంలోని గద్దగుండ్ల రాచపల్లి సమీపంలోని నామాలగుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు హరీ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.